సాక్షి
ప్రకాశం

సోమవారం ı 6 ı అక్టోబర్ ı 2025

రైతన్న కష్టం తెగుళ్లపాలు



పుల్లలచెరువు మిర్చి పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు

పుల్లలచెరువు: ఆరు గాలం కష్టించి మిర్చి పంట సాగు చేస్తే తీరా కాయలు కాసే నాటికి బొబ్బర తెగులు సోకి తీవ్రంగా నష్టపోయిన రైతు చివరకు ట్రాక్టర్‌తో పంటను దున్నేసిన ఘటన పుల్లలచెరువులో చోటుచేసుకుంది. పుల్లలచెరువుకు చెందిన రైతు బేతంశెట్టి నాసరయ్య తనకు ఉన్న ఎకరం పొలంలో మిర్చి పంట సాగు చేశాడు. తెగుళ్లు సోకడంతో షాపుల యజమానులు ఇచ్చిన మందులను వాడాడు. కానీ తెగుళ్ల తగ్గకపోవడంతో చేసేది లేక ఆదివారం పొలంలో ఉన్న మిర్చి పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. దాదాపు పొలం బాగు చేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు సుమారు లక్ష రూపాయల పెట్టుబడి పెట్టామని, ఇంక పెట్టుబడి పెట్టలేక పంటను దున్నేసినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

గరిష్టం/కనిష్టం
37 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

అంబేడ్కర్ విగ్రహ దహనం హేయం

- వైఎస్సార్ సీపీ ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున



మాజీ మంత్రి మేరుగ నాగార్జున

సంతనూతలపాడు: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిని ప్రభుత్వం వెంటనే శిక్షించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. ఆమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితులపై నిత్యం దాష్టీకాలేనని, దీనిలో భాగంగానే చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన టీడీపీ నేత సతీష్ నాయుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితుల గ్రామ బహిష్కరణలు, అంబేడ్కర్ విగ్రహాలకు అపచారం నిత్య కృత్యమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళితద్రోహిగా చరిత్రలో నిలిచిపోతాడని అన్నారు. అంబేడ్కర్ భావజాలాలపై టీడీపీ ఆది నుంచి విషం చిమ్ముతోందని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవం నిలబెట్టడానికి అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున విలువైన స్థలంలో రూ.450 కోట్లతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత విగ్రహాన్ని చూసి తట్టుకోలేక స్మృతి వనంలో లైటింగ్ తీసివేయించారని ఆరోపించారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలతోనే పేదలకు ఆరోగ్యం



రౌండ్‌టేబుల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలతోనే పేద ప్రజలకు వైద్యం లభిస్తుందని, వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడమంటే పేద ప్రజలకు వైద్యాన్ని తిరస్కరించడమేనని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని ఎల్బీజీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్యను, ప్రజారోగ్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన 17 మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించే ఆలోచనలను ఉపసంహరించుకోవాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల రాష్ట్ర ప్రజలకు మేలు జరగదని, కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చే విధానాలను మానుకోవాలని కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వెంకటరావు, జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీ సహా రాష్ట్రంలోని ఇతర మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 11వ తేదీ మార్కాపురం ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు, వైద్యరంగ నిపుణులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జేవీవీ నాయకులు ఏపీ పుల్లారావు, కుర్రా రామారావు, సీహెచ్ జయప్రకాష్, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, యు.భాస్కర్, డీఎల్ ప్రసాద్, ఎన్‌టీ వెంకటేశ్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్, పూలే విగ్రహాలకు క్షీరాభిషేకం



అంబేడ్కర్, పూలే విగ్రహాల వద్ద నినాదాలు చేస్తున్న ఐఎల్‌పీ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్టు చేయాలని ఐఎల్‌పీ అధ్యక్షుడు డీ సుందరరావు డిమాండ్ చేశారు. ఒంగోలు మంగమూరు డొంకలోని అంబేడ్కర్, పూలే, బుద్ధ విగ్రహాలకు ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవళంపేట గ్రామంలో టీడీపీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో కే వరప్రసాద్, డీ సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారంలో దోపిడీ హై..



హైటెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణంలో నష్టపోయే రైతులకు పరిహారం చెల్లించే విషయంలో ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఐదు రకాల పరిహారాలు ఇవ్వాల్సి ఉంటే లబ్ధిదారులకు అరకొరగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు. పరిహారం చెల్లింపులో తమకు జరిగిన అన్యాయంపై కొందరు రైతులు కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేయడంతో చివరకు ట్రాన్స్‌కో అధికారులు రైతులతో చర్చలకు దిగారు.



పంట పొలాల్లో వేసిన విద్యుత్ టవర్లు

- పొదిలి–తూర్పు గంగవరం హై టెన్షన్ టవర్ల నిర్మాణంలో మాయాజాలం
- రైతులకు పరిహారం చెల్లింపులో నిబంధనలు బేఖాతరు
- రైతులను మోసగించిన ట్రాన్స్ కో, రెవెన్యూ అధికారులు
- హై టెన్షన్ విద్యుత్ లైన్ వెంట 144 ఎకరాల్లో నష్టపోయిన రైతుల గగ్గోలు
- రైతుల సొమ్ము మింగేసిన అధికారులు, కాంట్రాక్టర్లు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

విద్యుత్ కాంట్రాక్టుల విషయంలో ట్రాన్స్ కో అధికారుల దోపిడీ అంతా ఇంతా కాదు. పెద్ద పెద్ద టవర్లు...హైటెన్షన్ విద్యుత్ లైన్లు పొలాల్లో గుండా పోతుంటాయి. కానీ రైతులకు రావాల్సిన పరిహారాలు ఇవ్వకుండానే అధికారులు, అధికార పార్టీ నాయకులు తినేస్తున్నారు. రైతులకు తెలియక ప్రభుత్వం విద్యుత్ లైన్లు వేస్తుంది మనమేమీ చేయలేమని వదిలేస్తున్నారు. అదే ట్రాన్స్ కో అధికారులకు వరంగా మారి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే...

పొదిలి–తూర్పు గంగవరం హైటెన్షన్ విద్యుత్ లైను నిర్మాణాన్ని ట్రాన్స్ కో అధికారులు చేపట్టారు. ఏడు సంవత్సరాల నుంచి పనులు చేపడుతున్నా ఇప్పటికీ విద్యుత్ లైన్ నిర్మాణం పూర్తి కాలేదు. ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. మొత్తం రూ.50 కోట్ల నిర్మాణ పనులు. మొదటి కాంట్రాక్టర్ రూ.12 కోట్లు పనులు చేశామని పూర్తిగా పనులు చేయకుండానే చేతులెత్తేశాడు. ఆ తరువాత మరో కాంట్రాక్టర్ రూ.15 కోట్ల వ్యయంతో చేస్తామని పనులు ప్రారంభించాడు. కానీ అదీ కూడా అంతంత మాత్రమే.

రైతులకు శఠగోపం...

పొదిలి నుంచి తూర్పు గంగవరం వరకు హై టెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణంతో పాటు పెద్ద పెద్ద విద్యుత్ టవర్లు కూడా నిర్మించాల్సి ఉంది. అందుకు సంబంధించి రైతులకు ఐదు రకాలుగా పరిహారాలు చెల్లించాలి. రైతులకు చెల్లించకుండానే చెల్లించామని రూ.10 కోట్లు ఇద్దరు కాంట్రాక్టర్లు, ట్రాన్స్ కో అధికారులు తినేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పొదిలి నుంచి తూర్పు గంగవరం వరకూ వెళ్లాల్సిన హైటెన్షన్ విద్యుత్ లైను, టవర్ల నిర్మాణంలో 144 ఎకరాలు పొడవునా రైతులు నష్ట పోతున్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.6 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో రైతుకు పది సెంట్ల మొదలుకొని 30 సెంట్ల వరకు పొలాన్ని కోల్పోతున్నాడు. అంటే మొత్తంగా విద్యుత్ లైన్ కింద మాత్రమే కోల్పోయే రైతులు 144 ఎకరాలు లెక్కల ప్రకారం తేలుతుంది. ఈ 144 ఎకరాలు లెక్కేస్తే మొత్తం రూ.8 కోట్లు అవుతుంది. మొత్తంగా 73 టవర్లు నిర్మిస్తున్నారు. ఒక్కో టవర్ నిర్మాణం, స్థలం ఖరీదు లెక్కేస్తే ఒక్కో టవర్ ఏరియాకు రూ.1.20 లక్షలు రైతులకు ఇవ్వాల్సి ఉంది. మొత్తం కలిపి రూ.87.60 లక్షలు రైతులకు పరిహారంగా ఇవ్వాలి. దానికి తోడు పంట నష్టం మొత్తం 500 ఎకరాల్లో జరుగుతుంది. పంట నష్టం కింద ప్రభుత్వం విడుదల చేసిన జీఓల ప్రకారం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాల్సి ఉంది. అంటే మొత్తం రూ.2.50 కోట్లు ఇవ్వాలి. మొత్తంగా 73 టవర్లు నిర్మించాల్సి ఉంటే వాటి నిర్మాణ సమయంలో చుట్టూ 50 మీటర్లు పొలాన్ని వాడుకుంటారు. పంట ఉన్నా ధ్వంసం చేసిమరీ వాడుకున్నారు. ఆ విధంగా చూస్తే 73 టవర్లకు ఒక్కోటవర్ కింద రైతుకు మరో రూ.50 వేలు ఇవ్వాల్సి ఉంది. అన్నీ కలిపి దాదాపు రూ.12 కోట్ల వరకు ఉంటుంది. తమకు నిబంధనల మేరకు పరిహారం అందలేదని పది మంది రైతులు నెల రోజుల క్రితం కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమాల విషయం వెలుగులోకి వచ్చింది. వీరితో పాటు మరి కొంత మంది రైతులకు కూడా పూర్తిస్థాయిలో పరిహారం దక్కలేదని తెలుస్తోంది.

అక్రమాల వెనుక రెవెన్యూ అధికారుల పాత్ర...

సాధారణంగా ప్రభుత్వ సంస్థలు రైతుల నుంచి పరిశ్రమలకైనా, విద్యుత్ లైన్లకైనా భూములు కావాలంటే రెవెన్యూ అధికారులు సర్వే చేయాల్సి ఉంది. రైతులను గుర్తించాలి. వాళ్లకు నోటీసులు ఇవ్వాలి. ఆ తరువాత వాళ్ల వద్ద నుంచి ఆధార్ కార్డులు, వాళ్ల బ్యాంకు అకౌంట్లు తీసుకోవాలి. రైతులు ఇష్ట పడితేనే వాళ్లకు రావాల్సిన ఐదు రకాల నష్ట పరిహారాలు వాళ్ల బ్యాంకు అకౌంట్లలో పరిహారం జమ చేయాలి.



గత నెల 26న ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులు, రైతులతో చర్చిస్తున్న ఒంగోలు ఆర్డీవో (ఫైల్)

పరిహారాల్లో లోపం జరిగింది నిజమే..

రైతులకు నష్ట పరిహారం విషయంలో రెవెన్యూ అధికారులతో, రైతులతో చర్చలు జరుపుతున్నాం. ఇటీవల ఒంగోలు ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ సమక్షంలో ట్రాన్స్ కో అధికారులు, రెవెన్యూ అధికారులు, రైతులతో చర్చించాం. రైతులకు పరిహారాల్లో కొంత లోపం జరిగిన మాట వాస్తవమే. నేను బాధ్యతలు తీసుకోకముందు జరిగిన పరిస్థితులు కొన్ని ఉండవచ్చు. అయితే నేను వచ్చిన తరువాత రైతులతో నేరుగా మాట్లాడుతున్నాను. ప్రతి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాను. ఇద్దరు కాంట్రాక్టర్లు మారారు. రైతులకు న్యాయం చేస్తాం.

– ఏ.కృష్ణారెడ్డి, ట్రాన్స్ కో ఈఈ

ట్రాన్స్ కో, రెవెన్యూ అధికారుల అక్రమాలు దారుణం



పొదిలి–తూర్పు గంగవరం హై టెన్షన్ విద్యుత్ లైను, టవర్ల నిర్మాణంలో ట్రాన్స్ కో, రెవెన్యూ అధికారుల అక్రమాలు దారుణం. నాకు, నా బంధువులకు సంబంధించి 10 ఎకరాల పొలంలో టవర్లు, హైటెన్షన్ లైన్ వచ్చింది. ఇంత వరకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదు. ఇలాగే లైను పొడవునా 144 ఎకరాల్లో నష్టపోయిన దాదాపు 350 మంది రైతులను కూడా మోసగించారు. ఐదు రకాల పరిహారాలు ఇవ్వాల్సి ఉంటే తూతూ మంత్రంగా ఇచ్చి రైతులకు రావాల్సిన సొమ్ము దోచుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా, ఒంగోలు ఆర్‌డీఓ దగ్గర చర్చలు జరిగాయి. కానీ ఏ అధికారి కూడా రైతుల సొమ్ము దోచుకున్న విషయాన్ని మాత్రం బయట పెట్టడం లేదు. అందుకే రైతుల పక్షాన పోరాటం చేస్తున్నాను. పొదిలి–తూర్పు గంగవరం విద్యుత్ లైనులో నష్టపోయిన రైతులు సంప్రదించండి. ఏ ఒక్క రైతు కూడా ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం నష్టపోకూడదు. నష్టపోయిన రైతులు ఎవరైనా నన్ను సంప్రదించవచ్చు.

– కేవీ.మల్లికార్జున రెడ్డి, రైతు, బక్కిరెడ్డి పాలెం, చీమకుర్తి మండలం

అయితే ట్రాన్స్ కో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై 73 టవర్లు నిర్మాణంలో ఉన్న రైతులకు మాత్రమే రూ.30 వేల నుంచి రూ.65 వేల వరకూ వేశారు. అంటే ఇక్కడ కూడా నిబంధనలు పాటించలేదు. ట్రాన్స్ కో, రెవెన్యూ అధికారులు కూడ బలుక్కొని రైతులకు చెందాల్సిన సొమ్ముకు వాటాలు వేసుకున్నారు. అసలు ఈ విద్యుత్ లైన్ కింద ఎంత మంది రైతులు ఉన్నారు. వాళ్లకు ఎంతమేర నష్ట పరిహారం ఇచ్చామని ట్రాన్స్ కో అధికారులు కూడా లెక్కలు బయట పెట్టడం లేదంటే రైతుల సొమ్ము ఎంత దోచుకున్నారో అర్థమవుతోంది.

రెచ్చిపోతున్న మట్టి దొంగలు



చింతలపాలెం పంచాయతీ పరిధిలో అక్రమంగా తవ్వి తరలిస్తున్న మట్టి



దూబగుంట్ల పంచాయతీ చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

- యథేచ్ఛగా పచ్చదండు అక్రమ మట్టి తవ్వకాలు
- చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఆగని తవ్వకాలు

పామూరు: ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువులను వదలకుండా కూటమి నేతలు యథేచ్ఛగా మట్టిని జేసీబీలతో తవ్వించి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మండలంలోని అనుములకొండ సమీపంలో చింతలపాలెం గ్రామ పంచాయతీకి సంబంధించిన పొలాల్లో కొన్ని రోజులుగా జేసీబీ, ట్రాక్టర్లతో కూటమి నాయకులు పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో నూతనంగా వేస్తున్న లేఅవుట్‌ల రోడ్లకు, నూతన భవనాల నిర్మాణాల పునాదుల కోసం తరలిస్తున్నారు. ఈప్రాంతంలో ఉన్న మరసమట్టి మేలు రకం కావడంతో ట్రాక్టర్ రూ.650 నుంచి రూ.800 దాకా పలుకుతోంది. ఇంత జరుగుతున్నా అటు పంచాయతీ కార్యదర్శులుగానీ, వీఆర్‌ఓలు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

అదేవిధంగా 167బి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దూబగుంట్ల చెరువులో ఇటీవల కూటమి నాయకులు డోజర్, జేసీబీలను పెట్టి మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారి పక్కన ఇలా తవ్వకాలు చేపడుతున్నారంటే అధికార బలంతోనే కూటమి నాయకులు అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

చెరువులు, ప్రభుత్వ భూముల్లో ఆగని తవ్వకాలు:

ఇటీవల మండలంలోని దూబగుంట్ల చెరువులో మట్టి తవ్వకాలను అధికారులు అడ్డుకుని జేసీబీ, ట్రాక్టర్ యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా దూబగుంట్లలో తవ్వకాలు ఆపేసి మరో ప్రాంతంలో తవ్వకాలకు తెరలేపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో లేఅవుట్‌లలో చదునుకోసం, రోడ్ల నిర్మాణానికి వందల సంఖ్యలో ట్రాక్టర్ల మట్టి అవసరమవుతుండగా దీనిని అక్రమంగా తవ్వి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మట్టి తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు



మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల దూబగుంట్ల చెరువులో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకున్నాం. ఎక్కడైనా మట్టి, ఇసుక తవ్వకాలు జరిపితే ఉపేక్షించేది లేదు.

– ఆర్.వాసుదేవరావు, తహసీల్దార్, పామూరు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సిగ్గుచేటు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్

ఒంగోలు టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సిగ్గుచేటని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ తీవ్రంగా విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నగరంలోని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ హాలులో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన 17 మెడికల్ కళాశాలలు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం నిర్మాణాల కోసం ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకోవడం అభ్యంతరకరమన్నారు. పీపీపీ పేరుతో సెల్ఫ్ ఫైనాన్స్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు, ప్రజలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ కాలేజీలను నిర్మించలేదని, మార్కాపురానికి కేటాయించిన వైద్య కళాశాలను నిర్మాణం పూర్తిచేయకుండా పీపీపీ పేరుతో సొంత వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మార్కాపురం వైద్య కళాశాలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని సీపీఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవడం భావ్యం కాదని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బేగ్ విమర్శించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఇఫ్టూ రాష్ట్ర నాయకులు మోహన్, సీపీఐ నాయకులు ఎంఏ సాలార్, ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు కార్తీక్, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు సుధాకర్, పీడీఎస్‌యూ నాయకులు సచిన్, ప్రేమ్, సామాజిక కార్యకర్త శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

- కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్



మాట్లాడుతున్న కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్

ఒంగోలు వన్‌టౌన్: కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్ కోరారు. ఆదివారం ఒంగోలు వచ్చిన ఆయన ప్రకాశం జిల్లా కాపు సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దొమ్మరులను గిరి బలిజగా మారుస్తూ ఇచ్చిన జీఓను స్టేటస్ కో ఇచ్చారన్నారు. దశాబ్ద కాలంగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు బీసీ రిజర్వేషన్ పెండింగ్‌లో ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రకటన చేయాలన్నారు. కాపు సమస్యలు అనేకం పరిష్కారం కాకుండా ఉంటే, ప్రభుత్వ పెద్దలు నూతన సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం కాపులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు కే సంజీవ్ కుమార్, పీ రాజ్య సులోచన, ఎన్ హనుమంతు రావు తదితరులు పాల్గొన్నారు.

పులి సంచారంపై అటవీ అధికారుల విచారణ



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు

వెలిగండ్ల (కనిగిరి రూరల్): నియోజకవర్గంలోని వెలిగండ్ల మండలం నాగిరెడ్డిపల్లి, వెదుళ్ల చెరువు, గుడిపాటి పల్లి బీట్ అటవీ ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వారం రోజుల క్రితం మరపగుంట్ల పొలాల్లో పులి తిరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే ఫారెస్ట్ అధికారులు ఆప్రాంతంలో పాద ముద్రల నమూనాలను సేకరించి.. అవి పెద్దపులి ఆనవాళ్లు కాదని తెలిపారు. చిరుత పులి, లేదా జంగుపిల్లి పాద ముద్రలు అయి ఉండవచ్చునని నిర్ధారించారు. తాజాగా శనివారం రాత్రి ఇమ్మడిచెరువు, రాళ్లపల్లి (శివారు ప్రాంతాల్లోని) గ్రామాల్లోని పొలాల్లోకి రాత్రి పది గంటల సమయంలో పులి రోడ్డు దాటుతుండటాన్ని బైక్ పై వెళ్తున్న జీ వెంకటయ్య చూసినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈమేరకు ఫారెస్ట్ రేంజర్ తుమ్మా ఉమా మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు గుడిపాటిపల్లి, సీఎస్ పురం బీట్ సెక్షన్ అధికారులు దొరసాని, నవీన్, నాయక్‌లు ఆయా ప్రాంతాల్లో ఆదివారం పర్యటించారు. వన్యప్రాణుల ఆనవాళ్లు, పాద ముద్రల నమూనాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి తుమ్మ ఉమా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ కనిగిరి ఫారెస్ట్ ప్రాంతంలో టైగర్ పెద్ద పులులు లేవని తెలిపారు. చిరుత లేదా, జంగుపల్లి ఆనవాళ్లుగా తెలుస్తోందన్నారు. పొలాల్లో సంచరిస్తున్న వన్యప్రాణులను నిర్ధారించేందుకు నాగిరెడ్డిపల్లి, వెదుళ్ల చెరువు బీట్ ప్రాంతాల్లో 'కెమెరా ట్రాప్స్' ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొండ కింద గ్రామాల ప్రజలు రాత్రి వేళ ఆరు బయట పడుకోవద్దని, పొలాలకు, పశువుల మేతకు ఒంటరిగా అడవి ప్రాంతంలోకి వెళ్లవద్దని సూచించారు.

సీనరేజి వసూలును ప్రైవేటుకు అప్పగించొద్దు

- ఎడ్జ్ కటింగ్ యూనిట్ల యూనియన్ అధ్యక్షుడు బూర్సు వెంకట కొండయ్య



సమావేశమైన ఎడ్జ్ కటింగ్ యూనిట్ యూనియన్ సభ్యులు

చీమకుర్తి రూరల్: గ్రానైట్ సీనరేజి వసూలు బాధ్యతను ప్రైవేటు సంస్థ అయిన ఏఎంఆర్ కు కేటాయించడాన్ని రద్దు చేయాలని ఎడ్జ్ కటింగ్ యూనిట్ల యూనియన్ అధ్యక్షుడు బూర్సు వెంకట కొండయ్య డిమాండ్ చేశారు. రామతీర్థంలోని వీటీసీ కార్యాలయంలో ఎడ్జ్ కటింగ్ యూనిట్లు నడుపుతున్న యజమానులు ఆదివారం సమావేశమయ్యారు. గ్రానైట్ పరిశ్రమల యజమానుల సమ్మెకు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రానైట్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి ఫ్యాక్టరీలు మూతపడే స్థితిలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిర్ణయాలు గ్రానైట్ పరిశ్రమలకు ఊతమిచ్చేలా ఉండాలే కానీ, గ్రానైట్ పరిశ్రమల మనుగడే ప్రశ్నార్థకంగా మార్చేలా ఉండకూడదన్నారు. ఎడ్జ్ కటింగ్ వంటి చిన్న కుటీర పరిశ్రమలపై ఆధారపడి సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది బతుకుతున్నారన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే తమ జీవితాలు రోడ్డున పడతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రానైట్ పరిశ్రమలను సంక్షోభం నుంచి బయటపడేలా రాయితీలు ఇవ్వాలని, కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎడ్జ్ కటింగ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఐనీడి బుల్లియ్య, చంద్ర, శివ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి

మద్దిపాడు: ఆగి ఉన్న లారీని డ్రైవర్ పరిశీలిస్తుండగా, వెనుక నుంచి వచ్చిన మరో వాహనం అతన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అనూస్ (26) చెన్నై నుంచి రాజస్థాన్‌కు లోడుతో లారీ తీసుకెళ్తుండగా వెల్లంపల్లి బ్రిడ్జిపై సాంకేతిక కారణాలతో లారీ ఆగిపోయింది. దీంతో కిందకు దిగి అనూస్ పరిశీలిస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనూస్ అక్కడికక్కడే మృతి చెందగా, స్థానికులు మద్దిపాడు పోలీసులకు సమాచారం అందించారు. మద్దిపాడు ఎస్‌ఐ వెంకటసూర్య సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడులు


పేకాటాడుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఒంగోలు టౌన్: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై ఆదివారం పోలీసులు విస్తృతంగా దాడులు చేశారు. ఒంగోలు తాలూకా, సంతనూతలపాడు, సింగరాయకొండ, జరుగుమల్లి, మార్కాపురం, మద్రిపూడి, మార్కాపురం రూరల్, కనిగిరి పోలీసు స్టేషన్ల పరిధిలో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి 55 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి 93,630 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. సింగరాయకొండలో కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,27,800 స్వాధీనం చేసుకున్నారు. కొండప్రాంతాలు, పొలాల్లో పేకాట శిబిరాలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి మరీ దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 47 మందితో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 12 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేశారు. జిల్లాలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే వెంటనే 112, పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు సమాచారం తెలియజేయాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు కోరారు.

టీడీపీ కార్యకర్తపై కేసు నమోదు

మార్కాపురం: మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి శనివారం సాయంత్రం తన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తుండగా కోలభీమునిపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బోయలపల్లి పోలిరెడ్డి దూషించడంతోపాటు అధికారిక విధులను ఆటంక పరిచిన విషయం తెలిసిందే. ఈ మేరకు తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.